## విద్యావంతులు ఆలోచించి ఓటు వేయండి

### జడ్పీ చైర్మన్ కమల్‌రాజు


గ్రాడ్యుయేట్లను ఓటు అభ్యర్థిస్తున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

మధిర, మే 25 : విద్యావంతులు ఆలోచించి నిజాయితీపరుడైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు కోరారు. శనివారం మర్లపాడు, మాటూరుపేట, నాగవరప్పాడు, మాటూరు గ్రామాల్లో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బులు, పదవుల కోసం ఆశపడే నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, అలాంటి వ్యక్తులను ఓడించాలన్నారు. విద్యావంతుడు, రైతుబిడ్డ, సమాజ సేవ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి ఓటు వేసి గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తారన్నారు. కార్యక్రమంలో మధిర మార్కెట్ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, నాయకులు అడపాల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు వేమిరెడ్డి నాగిరెడ్డి, మారంపుడి ప్రసాద్, రావూరి రాము, కటికల సత్యనారాయణరెడ్డి, కుర్రా శ్రీను, మాటూరు మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్లు ఓటు హక్కు వినియోగించుకోవాలి

### భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మే 25 (నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక సందర్భంగా ఈ నెల 27 గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ ఉంటుందని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఇదే నియోజకవర్గ పరిధిలో ఓటరుగా ఉండి.. ప్రైవేట్ యాజమాన్యాలు, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆయా యాజమాన్యాలు ఆరోజు వారి విధులకు ఆలస్యంగా వచ్చేందుకు లేదా పనిచేసే షిఫ్టులను సవరించడం లేదా పనివేళల్లో వెసులుబాటు అవకాశం కల్పించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

## 33 మంది మావోయిస్టులు లొంగుబాటు

- ముగ్గురిపై రూ.5 లక్షల రివార్డు
- వివరాలు వెల్లడించిన బీజాపూర్ ఎస్పీ జితేంద్రయాదవ్


లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జితేంద్ర యాదవ్

కొత్తగూడెం క్రైం, మే 25 : మావోయిస్టులు పోలీసు అధికారుల ఎదుట లొంగిపోయారు. దీంతో వరుస లొంగుబాట్లతో పోలీసులదే పైచేయిగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలను బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ శనివారం విలేకరులకు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగలూరు ప్రాంతంలోని 33 మంది జనతాన్ సర్కార్‌కి చెందిన మావోయిస్టులు లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. పీఎల్‌జీఏ ప్లాటూన్ నెంబర్ 1, 5 కంపెనీలోని 1వ నెంబర్ ప్లాటూన్ సభ్యుడు, జనతాన్ సర్కార్ అధ్యక్షుడితోపాటు 33 మంది మావోయిస్టులు బీజాపూర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ అధికారుల సమక్షంలో లొంగిపోయినట్లు వివరించారు. వీరంతా గంగలూరు పరిధిలోని డుమ్రిపల్నార్, కర్కా, హిరోలీ ప్రాంతాల నుంచి మావోయిస్టు పార్టీలో చురుగ్గా పని చేస్తున్నారని చెప్పారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలపై విసుగు చెందిన నాయకులు, సభ్యులు ఈ ఏడాది ఇప్పటివరకు 109 మంది లొంగిపోయారని, 189 మందిని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం లొంగిపోయిన వారిలో ముగ్గురిపై రూ.5 లక్షల రివార్డు ఉన్నదని వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ ప్రోత్సాహక, పునరావాస పథకం కింద రూ.25 వేల నగదు ఇవ్వనున్నట్లు వివరించారు.

**బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు...**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో శనివారం మరో ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు నేలకొరిగారు. బీజాపూర్ జిల్లా జబ్బమర్కా-కంకనార్ అడవుల్లో భద్రతా బలగాలు తనిఖీలు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య సుమారు 20 నిమిషాలపాటు కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు.

**సుక్మా ఎదురుకాల్పుల్లో ఒకరు...**

భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సుక్మా జిల్లా బెల్‌పొచ్చా గ్రామ సమీపంలో డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ జవాన్లు సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించారు. ఈ క్రమంలో తారసపడిన మావోయిస్టులు, జవాన్లకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. దీంతో ఒక మావోయిస్టు మృతి చెందాడు. ఘటనా స్థలం నుంచి మావోయిస్టు మృతదేహంతోపాటు ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు.

## ఏపీలో మావోయిస్టుల భారీ డంపు స్వాధీనం

### వివరాలు వెల్లడించిన అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా


స్వాధీనం చేసుకున్న డంపును పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

కొత్తగూడెం క్రైం, మే 25 : పోలీసు బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు ఏజెన్సీ ప్రాంతంలో దాచిన భారీ డంపును సరిహద్దు ఆంధ్రప్రదేశ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శనివారం విలేకరులకు వెల్లడించారు. ఏపీ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలీస్ బలగాలు మావోయిస్టుల కోసం కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో జీకే వీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల పనసాలబండ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టుల డంపును పోలీసులు గుర్తించారు. కూంబింగ్ నిర్వహించే పోలీస్ బలగాలను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు మందుపాతర పాతిపెట్టేందుకు వ్యూహం రచించినట్లు ఎస్పీ వెల్లడించారు. ఆ ప్రాంతం నుంచి 6 స్టీల్ క్యారేజ్ ల్యాండ్ మైన్స్, రెండు డైరెక్షనల్ మైన్స్, పేలుడు పదార్థం(కేఈఎల్ కంపెనీ), 150 మీటర్ల విద్యుత్ వైరు, 5 కేజీల మేకులు, ఇనుప నట్లు, మావోయిస్టు పార్టీకి చెందిన సాహితీ రచన పుస్తకాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అల్లూరి జిల్లాలో మావోయిస్టులు దాచిన డంపులన్నింటినీ త్వరలోనే స్వాధీనం చేసుకుంటామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం డంపును రికవరీ చేసిన జి. మాడుగుల ఎస్సై ఏ.శ్రీనివాసరావు, సీలేరు ఎస్సై రామకృష్ణ, ఆర్ఎస్సై జాన్ రోహిత్‌లను ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు. సమావేశంలో చింతపల్లి సబ్ డివిజన్ అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకుమార్ పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో పనులు పూర్తి చేయండి

### ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్


దమ్మపేట వసతి గృహంలో వసతులను పరిశీలిస్తున్న పీవో ప్రతీక్ జైన్

దమ్మపేట, మే 25 : పాఠశాలల ప్రారంభానికి ముందే వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదేశించారు. శనివారం అంకంపాలెం, దుర్గమ గొల్లగూడెం, చీపురుగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలు, దమ్మపేటలోని వసతి గృహాలను సందర్శించిన ఆయన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వచ్చే వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సెలవులు పూర్తయిన తొలిరోజు నుంచే మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు పడుకునే మంచాలు, గదుల్లో ఫ్యాన్లను పరిశీలించారు. బాత్‌రూమ్, మరుగుదొడ్లను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ డీఈ రామిరెడ్డి, ఏటీడీవో చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

## గప్‌చుప్!



- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- ఖమ్మంజిల్లాలో 37 పోలింగ్ కేంద్రాలు
- అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు

మామిళ్లగూడెం, మే 25 : ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచార పర్వం శనివారం ముగిసింది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారం 15రోజులపాటు హోరాహోరీగా సాగింది. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం మే 2వ తేదీన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఇదే నెల 9వ తేదీ నుంచి నామినేషన్ల పత్రాలను అధికారులు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రచారం చేశారు. దీంతో కార్యకర్తలు నూతనోత్సాహంతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, టీఆర్ఎస్ లోకసభా పక్షనేత, ఎంపీ నామా నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తోపాటు మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, మదన్‌లాల్, వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు. రాకేశ్‌రెడ్డి ఉన్నత విద్యావంతుడు కావడంతోపాటు వివాదరహితుడుగా పేరు పొందడంతో పట్టభద్రులు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారు. అదేవిధంగా నిరుద్యోగులు, యువత సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలంటే బలమైన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తేనే సమస్యల పట్ల నిలదీసేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

**ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి**

కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తిచేశారు. ఇప్పటికే ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది, అధికారుల నియామకాలను పూర్తిచేసి వారికి రెండు విడతలుగా పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మే 27న తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఆగమేఘాల మీద ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరగడంతో పెరిగిన ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 52మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా ఇందులో ముగ్గురు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఉన్నారు. మిగతా 49మంది అభ్యర్థులు వివిధ రిజిస్టర్ పార్టీల అభ్యర్థులతోపాటు ఏ పార్టీలతో సంబంధం లేని స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఖమ్మం జిల్లా పరిధిలో 37పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఓపీవోలను నియమించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం 20శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు చేశారు. అన్ని పోలింగ్‌కేంద్రాల లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖవారి సలహాల ప్రకారం అవసరమున్న అన్ని పోలింగ్ కేంద్రాల వెలుపల సీసీ కెమెరాలను పెట్టారు. జిల్లాలో మొత్తం 83,879 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా వారిలో 50,676 మంది పురుషులు, 33,199 మంది మహిళలు, 4 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఓటరు స్లిప్పులు కేవలం ఓటర్లకు సమాచారం మాత్రమే, పోలింగ్ కేంద్రానికి వచ్చేప్పుడు ఎన్నికల సంఘం సూచించిన ఏదేని గుర్తింపుకార్డు తీసుకపోవాల్సి ఉంది. పోలింగ్ తరువాత నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంకు బ్యాలెట్ బాక్సులను తరలించనున్నారు. ఓట్ల లెక్కింపును జూన్ 5వ తేదీన నిర్వహించనున్నారు.

**భద్రాద్రి కొత్తగూడెంలో..**

భద్రాద్రి కొత్తగూడెం, మే 25 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో మొత్తం 40,160 మంది పట్టభద్రులైన ఓటర్లు ఉన్నారు. వారిలో 22,590 మంది పురుషులు, 17,516 మంది మహిళలు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 55 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం పోలింగ్ సామగ్రి పంపిణీ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు.

## వయాకామ్18-స్టార్ ఇండియా విలీనం!

### సీసీఐ అనుమతి కోరిన రిలయన్స్ ఇండస్ట్రీస్




న్యూఢిల్లీ, మే 25: మీడియా విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముకేశ్ అంబానీ మరో అడుగుముందుకేశారు. వయాకామ్ 18, స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లను విలీనానికి సంబంధించి కాంపిటేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అనుమతి కోరారు. ఈ రెండు సంస్థలు విలీనమైన తర్వాత ఏర్పడే సంస్థ విలువ 8.5 బిలియన్ డాలర్లు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన వయాకామ్ 18, ది వాల్ట్ డిస్నీ కంపెనీ(టీడబ్ల్యూడీసీ)కి చెందిన స్టార్ ఇండియాలను విలీనం చేయనుండటంతో జాయింట్ వెంచర్‌లో సరికొత్త సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ జాయింట్ వెంచర్‌తో ఏర్పాటుకానున్న సంస్థతో రిలయన్స్‌కు చెందిన ఇతర మీడియా వ్యాపారాలపై ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టంచేసింది. టీవీ బ్రాడ్‌కాస్టింగ్‌తోపాటు ఓటీటీ ప్లాట్‌ఫాం సేవలను స్టార్ ఇండియా అందిస్తున్నది. అంతర్జాతీయ మీడియా దిగ్గజం వాల్ట్ డిస్నీ, రిలయన్స్ ఇండస్ట్రీలు తమ మీడియా సంస్థలను విలీనం చేస్తున్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ప్రకటించాయి. దీనికి నియంత్రణ మండళ్లు అనుమతించాల్సి ఉంటుంది. ఈ విలీనం తర్వాత ఏర్పడే సంస్థ దేశీయ మీడియా-ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో అతిపెద్ద సంస్థగా అవతరించనున్నది. ఈ సంస్థ చైర్మన్‌గా నీతా అంబానీ, వైస్ చైర్మన్‌గా ఉదయ్ శంకర్ వ్యవహరించనున్నారు. ఈ జాయింట్ వెంచర్‌లో రిలయన్స్‌కు 63.16 శాతం వాటా ఉండనుంగా, డిస్నీకి 36.84 శాతం వాటా ఉండనున్నది.

## దివీస్ లాభం 538 కోట్లు

### రూ.30 డివిడెండ్ ప్రకటించిన సంస్థ




హైదరాబాద్, మే 25: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ దివీస్ ల్యాబొరేటరీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.538 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.321 కోట్ల లాభంతో పోలిస్తే 67 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 18 శాతం ఎగబాకి రూ.1,951 కోట్ల నుంచి రూ.2,303 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.30 లేదా 1,500 శాతం తుది డివిడెండ్‌ను ప్రతిపాదించింది. ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా శనివారం సమావేశమైన కంపెనీ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.7,845 కోట్ల ఆదాయంపై రూ.1,600 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది.

## అరబిందో ఆకర్షణీయం

### క్యూ4లో 80 శాతం పెరిగిన లాభం




హైదరాబాద్, మే 25: అరబిందో ఫార్మా ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.909 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.508 కోట్లతో పోలిస్తే 79.6 శాతం ఎగబాకినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ. 6,473 కోట్ల నుంచి రూ.7,580 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.29 వేల కోట్ల ఆదాయంపై రూ.3,172 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మొత్తం ఆదాయంలో అమెరికా నుంచి రూ.3,588 కోట్ల ఆదాయం సమకూరగా, యూరప్ నుంచి రూ.1,832 కోట్లు లభించాయి. అలాగే రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం రూ.392 కోట్ల నిధులు వెచ్చించింది. నూతన మార్కెట్లోకి అడుగుపెట్టడం, మార్కెట్లోకి పలు ఔషధాలను విడుదల చేయడం కలిసొచ్చిందని అరబిందో ఫార్మా వైస్-చైర్మన్, ఎండీ కే నిత్యానందా రెడ్డి తెలిపారు.

## అందరికీ ఒకే పన్ను?

- కేంద్రంలో మళ్లీ మోదీ సర్కారు వస్తే ఇంతేనా!
- మదుపరుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు
- భారీ మార్పులకే సిద్ధమవుతున్న ఐటీ శాఖ?
- దేశీయ మార్కెట్లకు పెను సవాళ్లేనంటున్న నిపుణులు




న్యూఢిల్లీ, మే 25: ఎన్నికల ఫలితాలకు తోడు.. ఇప్పుడు మదుపరులకు మరో భయం జత కలిసింది. ఈ నెలారంభంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,100 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో మరోమారు బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తే దేశంలో ప్రస్తుతం అమలవుతున్న పన్నుల విధానంలో భారీ మార్పులకే ఆదాయ పన్ను (ఐటీ) శాఖ సిద్ధమవబోతున్నదన్న అంచనాలే ఇందుకు కారణం. పన్ను మినహాయింపులకు కోతలు పెట్టడం, జరిమానాలను ఇంకా పెంచడమే గాక.. అన్ని తరగతులవారికీ ఒకే పన్ను పడేలా ఐటీ శాఖ ముందుకెళ్తోందని అంటున్నారు మరి. ప్రస్తుతం భారత్‌లో ఆదాయాన్ని బట్టి రకరకాల పన్ను శ్లాబులున్న విషయం తెలిసిందే.

**ఈక్విటీ ఇన్వెస్టర్లకు దెబ్బ**

ఐటీ శాఖ తీసుకురావాలని చూస్తున్న పన్ను విధానాల్లో మార్పులు స్టాక్ మార్కెట్ల నష్టాలకు దారితీస్తాయని కూడా మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తున్నారు. మరోవైపు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ అంచనాలను కొట్టిపారేస్తున్నా.. ఇన్వెస్టర్లలో ఇప్పటికే నెలకొన్న భయాలు మాత్రం వీడటం లేదు. మార్పులు వాస్తవ రూపం దాల్చితే.. దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే మదుపరులకు పెద్ద దెబ్బేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రుణ మార్కెట్లలో మదుపు చేస్తున్నవారితో పోల్చితే ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టేవారికి వివిధ పన్ను ప్రోత్సాహకాలు లభిస్తుండటమే ఇందుకు కారణంగా వారు చెప్తున్నారు. పన్ను ప్రయోజనాలే లేకపోతే చాలామంది స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు ముందుకు రాలేరని అంటున్నారు. కాబట్టి

**ప్రస్తుతానికైతే..**

ప్రస్తుతం స్టాక్స్, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులపై ఏడాదిలోపే లాభాలను అందుకుంటే మదుపరులు దానిలో 15 శాతం స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను (ఎస్‌టీసీజీ)గా చెల్లించాల్సి వస్తున్నది. పెట్టుబడులు పెట్టిన ఏడాది తర్వాత లాభాలను ఆర్జిస్తే అందులో 10 శాతాన్ని దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ)గా కట్టాల్సి వస్తున్నది. ఇక ఒక్కో క్యాపిటల్ అసెట్‌కు ఒక్కోలా ఈ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పడుతున్నది.



"జూలైలో రాబోయే కేంద్ర బడ్జెట్‌లో మూలధన లాభాల పన్నులో ఏమైనా మార్పులుంటే.. భారతీయ మార్కెట్లలో దిద్దుబాటుకు అవకాశం ఉంటుంది. ఎన్నికల్లో బీజేపీ సాధించే సీట్లు కూడా స్టాక్ మార్కెట్లను నిర్దేశించగలవు. అయితే ఎన్నికల ఫలితం ఎలాగున్నా.. పన్ను విధానంలో మార్పులు మాత్రం భారీ నష్టాలకే దారి తీయగలవు. అదీగాక రిటైల్ ఇన్వెస్టర్లకు క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ను పెంచాలన్న ప్రతిపాదన కూడా వినిపిస్తున్నది. ఏమైనా పన్నుల భారం పెరిగితే మదుపరులు ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి లోనుకావచ్చు. *2004లో బీజేపీ ప్రభుత్వం ఓటమిపాలైతే కేవలం రెండు సెషన్లలో మార్కెట్లు 17 శాతానికిపైగా క్షీణించాయి. ఈసారి బీజేపీ ఓడిపోయినా ఆ స్థాయి నష్టాలు రాకపోవచ్చుగానీ.. క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ను సవరిస్తే మాత్రం అంతకన్నా ఎక్కువ నష్టాలు వాటిల్లుతాయని చెప్పవచ్చు.*

-క్రిస్టోఫర్ వుడ్, జెఫరీస్ బ్రోకరేజీ నిపుణుడు



## రోజుకు 1,800 కోట్లు

### కొనసాగుతున్న ఎఫ్ఐఐల అమ్మకాలు

ముంబై, మే 25: విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు సార్వత్రిక ఎన్నికలు ప్రారంభమైననాటి నుంచి ఇప్పటి వరకు దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులు తరలించుకుపోయారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి మెజార్టీ వచ్చే అవకాశాలు లేవని అంచనాలు వెల్లడికావడంతో విదేశీ మదుపరుల్లో ఆందోళన మరింత పెరిగింది. లోకసభ ఎన్నికలు ప్రారంభమైన ఏప్రిల్ 19 నుంచి ఇప్పటి వరకు 21 రోజుల్లో రూ.37,700 కోట్లను ఉపసంహరించుకున్నారు. నికరంగా రోజుకు రూ.1,800 కోట్లకు పైగా పెట్టుబడులను తరలించుకుపోయినట్లు అయింది. ఇండియా వీఐఎక్స్ సూచీ రికార్డు స్థాయిలో 67 శాతం పెరగడం వల్లనే విదేశీ మదుపరుల్లో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది.

## నగదు లావాదేవీలకే సై

### కార్లు, కంప్యూటర్లు, ఫోన్లు క్యాష్‌తోనే కొనుగోళ్లు



న్యూఢిల్లీ, మే 25: డిజిటల్ ఆర్థిక సేవలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. దేశవ్యాప్తంగా నగదుతో కొనుగోలు చేసే వారి సంఖ్య అంతకంతకు పెరుగుతున్నారు. ముఖ్యంగా ఐఫోన్లు, కార్లను నగదు రూపంలోనే అత్యధిక మంది కొనుగోలు చేస్తున్నారంట. యాపిల్‌కు దేశవ్యాప్తంగా ఉన్న రెండు స్టోర్లలో డిజిటల్‌కు బదులు నగదు ఇచ్చి తమకు నచ్చినదానిని కొనుగోలు చేస్తున్నారంట. గడిచిన నెలలో వీరి వాటా 7-9 శాతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో సంస్థ ఈ రెండు స్టోర్లలో నగదు లెక్కించే యంత్రాలను ఏర్పాటు చేసింది అంటే..డిజిటల్ కంటే నగదు ద్వారానే కొనుగోళ్లకు మొగ్గుచూపుతున్నారో తెలుస్తున్నది.

**నగదు చలామణి రెండింతలు**

దేశవ్యాప్తంగా నగదు చలామణి రెండింతలు పెరిగింది. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి నరేంద్ర మోదీ సర్కార్ తీసుకుంటున్న చర్యలు బెడిసికొడుతున్నాయి. నల్లధనాన్ని అరికట్టడానికి రోజుకు నగదు ద్వారా జరిపే లావాదేవీలను రూ.2 లక్షలకు నియంత్రించినప్పటికీ నగదు చలామణి మాత్రం ఆగడం లేదు. ఏకంగా రెండింతలు పెరిగి రూ.35.15 లక్షల కోట్లకు చేరుకున్నది. మార్చి 2017లో ఇది రూ.13.35 లక్షల కోట్లుగా ఉండగా, కేవలం ఏడేండ్లలోనే రెండు రెట్లు పెరగడం విశేషం. అలాగే ఇదే సమయంలో యూపీఐ చెల్లింపులు కూడా రూ.19.64 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఏడేండ్లక్రితం ఇది రూ.2,425 కోట్లు మాత్రమేనని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తాజాగా వెల్లడించింది.

**15-20 శాతం..**

ప్రస్తుతం ఎక్కువ మంది నగదు చెల్లింపులతోనే కార్లను కొనుగోలు చేసున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్న కార్లలో 15-20 శాతం నగదు రూపంలోనే కొనుగోళ్లు జరిపారని ది ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్(ఫాడా) తెలిపింది. లగ్జరీ కార్లతోపాటు దేశీయంగా అమ్ముడవుతున్న ఐదింటిలో ఒక్కటి నగదు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారని వెల్లడించింది. వీటిలో రూ.2 లక్షల వరకు నగదు ఇచ్చి, మిగతాది చెక్ రూపంలో, బ్యాంక్ డ్రాఫ్ట్ లేదా బ్యాంక్ ఖాతా నుంచి, నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డు లేదా ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిధులను పంపిస్తున్నారు.

## వాణిజ్య

### కెనరా గ్రీన్ డిపాజిట్ స్కీం

హైదరాబాద్, మే 25: ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ ప్రత్యేక డిపాజిట్ స్కీంను ప్రవేశపెట్టింది. డిపాజిట్‌దారులను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో 'కెనరా గ్రీన్ డిపాజిట్ స్కీం'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 1111, 2222, 3333 రోజుల కాలపరిమితితో డిపాజిట్లపై 7.20 శాతం వార్షిక వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ ప్రత్యేక డిపాజిట్ స్కీంలో భారతీయులతోపాటు ప్రవాస భారతీయులు కూడా డిపాజిట్ చేయవచ్చునని తెలిపింది.

### రిలయన్స్ పవర్ నష్టం 397 కోట్లు

న్యూఢిల్లీ, మే 25: రిలయన్స్ పవర్ లిమిటెడ్ నష్టాల పరంపర కొనసాగుతున్నది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థకు రూ.397.66 కోట్ల నష్టం వచ్చింది. ఇంధనం కోసం పెట్టే ఖర్చులు అధికం కావడం వల్లనే నష్టాలు వచ్చాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. కంపెనీ ఆదాయం రూ.1,853.42 కోట్ల నుంచి రూ.2,193.85 కోట్లకు పెరిగాయి. చమురు కోసం అయ్యే ఖర్చు రూ.823.47 కోట్ల నుంచి రూ.953.67 కోట్లకు పెరిగినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ప్రస్తుతం సంస్థ 6 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నది.

### విప్రో మాజీ బాస్ వేతనం 166 కోట్లు

న్యూఢిల్లీ, మే 25: విప్రో మాజీ సీఈవో, ఎండీ థెరీ డెలాపోర్ట్ గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.165 కోట్ల వార్షిక వేతనం అందుకున్నారు. దేశీయ ఐటీ రంగంలో అత్యధిక వేతనం అందుకున్నది ఆయనే కావడం విశేషం. 20 మిలియన్ డాలర్లు లేదా రూ.165 కోట్లు అందుకున్నట్లు కంపెనీ విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. గత నెలలో విప్రో సీఈవో పదవికి ఆయన రాజీనామా చేయడంతో ఈ స్థానంలో శ్రీనివాస్ పల్లె నియమితులయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను డెలాపోర్ట్ వేతనం కింద 3.9 మిలియన్ డాలర్లు అందుకోగా, అలవెన్స్ కింద మరో 5 మిలియన్ డాలర్లు, అదనపు చెల్లింపుల కింద 7 మిలియన్ డాలర్లు, దీర్ఘకాలిక పరిహారం కింద మరో 4 మిలియన్ డాలర్లు అందుకున్నారు.